# నేను నేనే-8

**Index** **Page no**


| Index | Page no |
|---|---|
| 128. పొందాలంటే పోగొట్టుకోవాలి | 2 |
| 129. ఆత్మనిష్ఠయే గొప్ప సాధన; సిద్ధి | 9 |
| 130. భగవంతునితో బంధమే మోక్షం | 16 |
| 131. నేను 'కర్త'ను కానని ఉంటే ఉన్నా లేనివారే | 22 |
| 132. ఆధ్యాత్మికం | 24 |
| 133. పరమవిశ్రాంతి | 25 |
| 134. పరిపూర్ణంగా అనుభవించండి | 26 |
| 135. అద్వైతమే మూలబీజం-దేవునిగర్భం-కాలగర్భం | 28 |
| 136. అర్థం కాలేదు-అర్థం అయ్యింది-శరణాగతి | 30 |
| 137. భ్రమాత్మక బంధాలు-అర్థమయ్యీ కానట్టుగా ఉంది | 32 |
| 138. అరిషడ్వర్గాలు-రాగద్వేషాలు | 34 |
| 139. చూడబడేది అబద్ధం, చూచేవాడు నిజం | 36 |
| 140. అద్దెఇల్లు-జ్ఞానిలక్షణం-అంతర్భాగం | 38 |
| 141. నవరంధ్రాలు-విషయ'జలం' | 40 |
| 142. వ్యక్తి-జగత్తు-జగదీశ్వరుడు-పూర్ణబ్రహ్మం-నాలుగు పావలాలు | 42 |
| 143. అద్వైత జ్ఞాన సూత్రాలు-1 | 46 |
| 144. Conclusion | 57 |

**128.పొందాలంటే పోగొట్టుకోవాలి**

తన్ను తాను చూడడమంటే
తాను దైవాన్ని చూడడమే.
(ఇది జ్ఞాన మార్గం)

తాను దైవాన్ని చూడడమంటే
తనను తాను చూడడమే.
(ఇది భక్తి మార్గం)

ఒకే వస్తువుకున్న రెండు పేర్లు అవి -
1.తాను 2.దైవం.

తాను(దైవం) సదా ఏకవచనం.
ఎవడైనా తనను గురించి చెప్పేటప్పుడు
"నేను" అంటాడేగాని "మేము" అనడు.

చూడడానికి, తెలుసుకోవడానికి తనకు అన్యం లేని అనంతవస్తువే తాను.
తాను, దైవం వేరు వేరు కాదు కాబట్టి
తాను దైవాన్ని చూడడం అనే క్రియే లేదు.

* * *

దైవాన్ని చూడడమంటే-
వ్యక్తిగతమైన తాను(అహమిక)

ఆ సర్వగతమైన తనకు(దైవానికి)
ఆహారం ఐపోవడమే.

* * *

ఓ కప్ప పామును గురించి వినడమేగాని, ముఖాముఖిగా యెన్నడూ చూడలేదట.
పామును ఎలా అయినా చూడాలని అందరినీ విచారిస్తూ, అన్వేషిస్తూ నానా ప్రయత్నాలే చేసిందట...
ఎట్టకేలకు పాము కంట పడింది.
మరుక్షణం ఆ కప్ప ఈ భూమ్మీద లేదు.
పాముకు ఆహారమైపోయింది.

వ్యక్తికి దైవసాక్షాత్కారం కలగడం కూడా అంతే.

తాను ఉండి, తాను దైవాన్ని చూడడం కాదు,
దైవానికి తాను ఆహారమైపోయి, 'దైవం' ఒక్కటే మిగలడమే దైవసాక్షాత్కారము.

సుఖపడదలుచుకున్నవాడు పొరపాటున కూడా దేవుడి జోలికి, గురువు జోలికి వెళ్లకండి...
నువ్వేం అడిగినా సరే, వారు ఇవ్వదలచుకున్నదే ఇస్తారు....
"సర్వ" నాశనం చేస్తారు...
"సర్వనాశనం" అయ్యాక మిగిలి ఉండేదే ఆత్మ.

ఆత్మను క్రొత్తగా ఎవరూ ఇవ్వరు.
క్రొత్తగా ఎవరూ పొందరు.
ఉన్న సమస్తాన్ని పోగొట్టుకుంటే చాలు.
ఆత్మ తేటతెల్లమౌతుంది.

సాధన చేయవలసిందే-
దానిని పోగొట్టుకోవడానికే.
ఐనదానిని పొందటానికి కాదు.

నీతో సహా సర్వాన్ని పోగొట్టుకునే టెక్నిక్ బోధిస్తారు సద్గురువు.
అంతేగాని నువ్వడిగిందల్లా ఇవ్వడం వారి పని కాదు.
ఒకవేళ అలా నీవడిగింది ఇచ్చినట్టు కనబడ్డా, అదొక "ఎర" లాంటిదే.

ఎరకు తగిలిన చేపకు యెవరూ సన్మానం చేయరు.
సట్లో వేసి వండుకుని తినేస్తారు.

వారికి ఆహారమే నీవు.

దానికి సిద్ధపడితేనే వారి కంట పడు.

లేదంటే నీ మానాన నీవు ఉండు.

వారి జోలికి వెళ్లకు.

ఆ దేవుణ్ణి నమ్ముకున్నాను...

ఆ గురువును నమ్ముకున్నాను...

వారు నాకు ఏమీ చేయలేదు...

నాకు అన్నీ కష్టాలే...

అని వాపోతుంటారు కొందరు.

"చల్లటి అగ్ని" ఉంటుందా ఎక్కడైనా?

దేవుడన్నా, గురువన్నా వారొక పెద్ద అగ్నికుండం.

నిన్ను కాల్చి బూడిద చేస్తుంది...చివరకు బూడిద కూడా మిగల్చని "మహా అగ్ని" అది.

నిప్పుకణిక మీద వాలాలని భావించే ఈగ లాంటివారే

ఈశ్వరసన్నిధికి, గురుసన్నిధికి వెళ్లేవాళ్ల పరిస్థితి కూడా.

నేను ఈ భూమ్మీదకు సమాధానపరచడానికి రాలేదు.

అగ్ని వేయడానికి వచ్చాను...అంటారు క్రీస్తు.

మన పరిసరాలు, మన పరిస్థితులు...

మన కుటుంబం, మన ఉద్యోగం...

మన స్నేహితులు, బంధువులు...

మన ఆరోగ్యం...మన సంతానం....

అంతా అలాగే ఉండాలి...

దేవుణ్ణి పొందేయాలంటే కుదరదు...

"నాది" అనుకున్నది ధ్వంసం అయిపోతేగాని

"నేను" అనేది తేటతెల్లం కాదు.

అనగా నీవు ప్రపంచంలో దేనికైతే ప్రాధాన్యత ఇచ్చావో
అవన్నీ నశిస్తేగాని, స్వరూపమైన దైవానికి ప్రాధాన్యత ఇవ్వలేవు...

అంతేగాని ఓ అరగంటో, గంటో కళ్లు మూసుకొని కూర్చుంటే స్వరూపం తెలియబడదు.

ఏమీ వదలకుండా, అన్నీ పొందాలనే
చేసే యెత్తుగడలే ఈ కపట సాధనలు.

"నేను ముక్తి పొందడం ఎలా?" అడుగుతాడు శిష్యుడు.
"నేను" పోతే ముక్తి అంటాడు గురువు.

నీవు 'పోయాక' కోటిరూపాయిలు ఇస్తాం అన్న ఇన్సురెన్సు పాలసీలా అనిపిస్తుంది శిష్యునికి.

కానీ తప్పదు....
పొందాలంటే పోగొట్టుకోవాలి.
జీవించాలంటే మరణించాలి.

* * *

నిజానికి 'నేను'ను(అహాన్ని ) పోగొట్టుకోవడానికి దిగులు చెందనవసరం లేదు.

నది సముద్రంలో కలిసి సముద్రంగా మారుకున్నట్టు
ఈ పరిమితమైన నేను అనంతమైన నేనుగా మారుకుంటుంది.

కాబట్టి శరణాగతి అనేది సర్వం దైవానికి సమర్పించి, సర్వం పోగొట్టున్నట్టు అనిపిస్తుంది.
కానీ 'సర్వం పొందడమే' శరణాగతికి ఫలం.
పావలా పోగొట్టుకుని 'రూపాయి'ని పొందినట్టుగా.

* * *

రూపాయి చిల్లరలో పావలా విడిగా కనబడుతుందే గాని
రూపాయి నాణెంలో పావలా ఉన్నా విడిగా కనబడదు.

అలాగే నిద్రలో, మరణంలో అహమిక ఉంటుంది.
ముక్తిలో అహమిక ఆత్మలో తల్లీనమైపోయి ఉంటుంది.

అందువలన నిద్ర, మరణం అనేవి - అజ్ఞానస్థితులు.
తురీయం, మోక్షం అనేవి - జ్ఞానస్థితులు.

* * *

మరణంలో అహమిక మరో శరీరాన్ని, మరో ప్రపంచాన్ని అది సృష్టించుకుంటుంది.

కాబట్టి జీవించి ఉండగానే తాను(అహమిక) చావాలి.
అదే జీవన్ముక్తి.

తాను మరో శరీరంగా మొలకెత్తకుండా
ఆత్మలో తల్లీనమై ఉండడమే పరమపదం.

* * *

ఒక్కసారి అంతర్ముఖం అయ్యి....
'నేను' మూలాన్ని అన్వేషిస్తే చాలు...

అక్కడ మరో 'నేను' సాక్షాత్కరించి
ఈ వ్యక్తిగతమైన 'నేను'ను కబళించేస్తుంది.

తరువాత కూడా తాను ప్రపంచానికి కనబడుతున్నట్టు ఉంటాడేగాని,
నేను-నేను అంటూ వ్యవహరిస్తున్నట్టు కనిపిస్తాడేగాని
నిజానికి తనకు తానుండడు.

* * *

1. బుద్ధి చేత దైవాన్ని తెలుసుకోలేం
2. బుద్ధి చేతనే దైవాన్ని తెలుసుకోగలం.

సమన్వయం ఎలాగంటే,

1.బుద్ధి చేత (బాహ్యవస్తువును తెలుసుకున్నట్టు ఓ విషయంగా)దైవాన్ని తెలుసుకోలేం.

2.బుద్ధి చేతనే(అనగా బుద్ధిని లోనికి త్రిప్పడం వలన) దైవాన్ని తెలుసుకోగలం.

* * *

ఆత్మ యొక్క ప్రకాశవైభవమే బుద్ధి.

బుద్ధి ఆత్మకాదు, ఆత్మకు భిన్నమూ కాదు.

కిరణం సూర్యుడు కాదు, సూర్యునికి భిన్నమూ కాదు.

కెరటం సముద్రం కాదు, సముద్రానికి భిన్నమూ కాదు.

అది వెలిగా వచ్చి లోక విషయాలను వివేచించి తెలుసుకోగల సామర్థ్యమూ దానికి ఉంది.

అది లోపలికి వెళ్లి అహంమూలాన్ని శోధించి ఆత్మలో లీనమయ్యే సామర్థ్యమూ దానికి ఉంది.

* * *

విషయసంగ్రహణ చేస్తూ బుద్ధివైభవాన్ని
ప్రకటించేవాడు విజ్ఞాని అవుతాడు.

బుద్ధిని అంతర్ముఖం గావించి ఆత్మలో లీనం
చేసేవాడు  జ్ఞాని అవుతాడు.

* * *

తెలుసుకోవడం - విజ్ఞానం.

తెలుసు అనడం - అజ్ఞానం.

తెలియదు అనడం - జ్ఞానం.

విజ్ఞానం మనల్ని అనేకం వైపుకు తీసుకెళుతుంది.
జ్ఞానం మనల్ని ఏకం వైపుకు తీసుకెళుతుంది.

విజ్ఞానం బాహ్యవిషయం.
జ్ఞానం అంతర్ విషయం.

* * *

బుద్ధిని లోనకి త్రిప్పడం అంటే,
బాహ్య(ఐహిక)బంధాలను త్రెంపడమే.

బాహ్యబంధాలను త్రెంపడం అంటే,
"నేను-నాది అనేవి ఆత్మ(ప్రొజెక్టర్)నుండి వెలువడే కాంతి తెరపై(మనసుపై) పడడం వలన కదలాడే నీడలే"
అని వైరాగ్యం కలిగి ఉండడం.

"ఇతరములన్నియు నేమిటికి?
మతి చంచలమే మానుట పరము"
అంటాడు అన్నమయ్య.

* * *

పారమార్థిక పరిభాషలో చెప్పుకోవాలంటే-
బుద్ధి ఉన్నవాడు బుద్ధిమంతుడు.
బుద్ధి లేనివాడు జ్ఞానవంతుడు.

* * *

**129. ఆత్మనిష్ఠయే గొప్ప సాధన; సిద్ధి.**

నాకు నాలుక ఉందా? అని ఒకడు అడిగాడట...

నాలుక ఉండబట్టే ఆ ప్రశ్నను వేయగలిగాడు...

'నేనెవరో నాకు తెలియదు' అనే విషయం కూడా

తెలివి(జ్ఞానం) ఉంటేనే తెలుస్తుంది.

నాకు తెలుసు అనడానికి

నాకు తెలియదు అనడానికి

ఏ తెలివి అయితే ఆధారమో

ఆ తెలివే తాను.

అందువలన తెలిసినవాడు

తెలుసు అనడు.

తెలియదు అనడు.

యెందుకంటే "తెలివే" తాను గనుక.

* * *

నేనెవరో నాకు తెలుసు అనడం

నేనెవరో నాకు తెలియదు అనడం

రెండూ హాస్యాస్పదమే.

యెందుకంటే-

నాకు నేను తెలుసు అనడానికి

నాకు నేను తెలియదు అనడానికి

రెండు నేనులు ఉన్నాయా?

లేవు కదా....

ఉన్నది ఒకే నేను.

ప్రతి ఒక్కడూ 'నేను! అంటాడేగాని
'మేము' అనడు.

కాబట్టి తాను సదా ఏకవచనమే.

నాకు తెలుసు
నాకు తెలియదు
అనడానికి అవకాశం లేని  ఏకాత్మస్వరూపుడు తాను.

తెలియనివాడే-
నాకు తెలుసు అనిగానీ
నాకు తెలియదు అనిగానీ
అంటాడు.
యెందుకంటే తెలియనివానికి అన్యం ఉంటుంది.

తెలిసినవాడు-
తెలుసు అనడు.
తెలియదు అనడు.
ఊరక ఉంటాడు.
యెందుకంటే తెలిసినవానికి అన్యం ఉండదు.

తెలియనివాడు(అజ్ఞాని)
తెలిసినవాడు(జ్ఞాని)
ఇద్దరూ జ్ఞానమునకు బొమ్మ-బొరుసు లాంటివారే.

జ్ఞానాజ్ఞాన వివాదమంటని
జ్ఞానివి నీవే అనిలాచలా!
అంటారు గురుదేవులు.

"నేను" అని

అజ్ఞాని పలికినా
జ్ఞాని పలికినా
ఆ పలుకు దేవునిదే.

"నేను" అని అంతటితో ఆగిపోతే
నీవే దేవుడవు.

"నేను" తర్వాత ఇంకొక్క అక్షరం చేర్చినా
నీవు జీవుడవు.

* * *

"స్వ"రాజ్యం  మనందరి జన్మ హక్కు.
"స్వ" అంటే ఆత్మ.
ఆత్మరాజ్యం మనందరిదీ....

ఏ కొందరికి మాత్రమే అది లభ్యం అనే నిరాశావాదం అనవసరం.

ప్రతి ఒక్కని హృదయమూ ఆత్మకు పీఠమే.
హృదయాన్ని చేరడానికి అంతర్ముఖత్వమే రాజమార్గం.

హృదయంలో నిలుకడ చెందక,
ఆత్మను బాహ్యవ్యవహారంలోకి తీసుకొచ్చి, "ఆధ్యాత్మికం"  "సత్సంగం" లాంటి పేర్లతో పదిమంది గుమికూడి,
ఆత్మగురించిన ఊహాత్మకమైన భావనలతో, వాదనలతో నీకు నీవే ఆటంకాల్ని కల్పించుకుంటున్నావు.
ఇదంతా మాయాదోషం...
అనగా తెలివితక్కువతనం.

లౌకిక విషయాలలో మూకుమ్మడి ప్రయత్నాలు సఫలం అవుతాయేగాని,
ఆధ్యాత్మిక విషయంలో మాత్రం ఒంటరిపోరాటం(one man army)వలనే సఫలం అవుతుంది.
మూకుమ్మడి భజనలు, యాత్రలు, సత్సంగాలు ధ్యానాలు....ఇవేవీ సహాయకారులు కావు.
పైగా అవి ఆటంకాలు...

భగవాన్ రమణులకు తన 16వ యేట మేడపైన పడుకుని ఉండగా హఠాత్తుగా మృత్యుభీతి కలిగింది. యెవరినీ సంప్రదించలేదు....అక్కడికక్కడే, అప్పటికప్పుడే విచారణ చేసి "ఈ శరీరం నేను కాదు, 'నేనున్నాను' అన్న కేవల ఎరుకను నేను' అన్న అనుభవాన్ని పొందారు. ఆ మృత్యుభీతిని అధికమించి, మనిషి ఋషి అయినాడు.

ఆ 16 ఏళ్ల బాలుడు ముక్తికై ఏ శాస్త్రాలూ చదువలేదు, ఏ మంత్రాన్ని జపించలేదు, ఏ తీర్థయాత్రా చేయలేదు, ఏ సత్సంగమూ చేయలేదు, ఏ గురువునూ ఆశ్రయించలేదు...

ముక్తికాంక్ష అసలే లేదు...
అసలు ముక్తి అనే పదమే వినలేదు, కానీ ముక్తిని పొందాడు.
అదే చిత్రం.
ముక్తిని పొందటానికి అక్కడ ఉపయోగపడిన అంశం - ఆర్తి.
అనగా తక్షణం దుఃఖం నుండి విడుదల కావాలనే తీవ్రతపన.
తీవ్రతపనే తపస్సు.

అదే అతణ్ణి ముక్తుణ్ణి కావించింది.
అలాంటి ఆర్తులు ఇప్పుడే ఇక్కడే ముక్తులు.
ఆర్తి లేనప్పుడు "ఆధ్యాత్మిక జీవనం" పేరుతో జరిగేదంతా సత్ కాలక్షేపం(Time Pass). అంతే.

* * *

చాలా సంపద కూడి గొప్ప ధనవంతుడైనట్లు
కలను కంటావు...
మేలుకుంటావు...నవ్వుకుంటావు...
లేదా
ఉన్నదంతా పోగొట్టుకుని బికారియైనట్లు
కలను కంటావు...
మేలుకుంటావు....నవ్వుకుంటావు...
యెందుకు?
యెందుకంటే - "స్వప్నం నిజం కాదు"

అని నీకు తెలుసు కాబట్టి.

గుర్వనుగ్రహం వలన ఈ జాగ్రదవస్త కూడా
ఓ పెద్ద కల అని తెలిసుకున్నాక,
ఇందులోని ప్రతి ఘట్టమూ నవ్వులాటగా ఉంటుందే తప్ప, దేనికీ సీరియస్ గా ప్రతిస్పందించడం అనేది ఉండదు.

* * *

అనేకమంది సాధకులు సిద్ధులకై ప్రయత్నిస్తుంటారేగాని,
ఆత్మసిద్ధికై ఎవడూ ప్రయత్నించడు.

లేదా నిజంగానే ఆత్మసిద్ధికై సాధన మొదలు పెట్టినప్పటికీ, మధ్యలో సిద్ధులు కలిగి, ఆ వైపుకు ఆకర్షింపబడి గమ్యాన్ని చేరకపోవడమూ ఉంది.

సిద్ధులన్నీ స్వప్నసిద్ధులే.
ఈ మహాస్వప్నం నుండి మేలుకోవడమే మహాసిద్ధి.

కలలోనే ఉంటూనే ఇది కల అని తెలుసుకునే జ్ఞానమే ఆధ్యాత్మిక జ్ఞానము.
మెలకువలో ఉంటూనే మెలకువగా(ఇది కూడా ఓ కలే అని) ఉండడమే ఆధ్యాత్మిక జ్ఞానము.
మేలుకో-మేలుకో అని కఠోపనిషత్తు ఘోషించడానికి కారణమిదే.
నీవు దేనినయితే మెలకువ అంటున్నావో అది మెలకువ కాదు అని అర్థం.

మెలకువలో నుంచి మేలుకోవడమే మోక్షం.

కలలు, మెలకువలు కలయని ఎరిగిన
"మెలకువ" తానే అనిలాచలా!
అన్నారు గురుదేవులు.

"మెలకువ" అంటే నిత్య ఎరుక.(అచలమైన ఎరుక)

జాగ్రత్-స్వప్న-సుషుప్తులు మూడింటిలోనూ
"నేనున్నాను" అన్న నిత్య ఎరుకలో ఉండడమే మహాసిద్ధి.

అటువంటి మహాసిద్ధిని పొందటానికి
కేవలం గ్రంథపఠనం, క్షేత్రదర్శనం చాలవు.

ఈ అజ్ఞానమనే గాఢనిద్ర నుండి,
ఆ నిద్రలో కనే ఈ స్వప్న ప్రపంచం నుండి
నిన్ను గట్టిగా తట్టి లేపగలిగేది సద్గురు సాంగత్యం ఒక్కటే.

లే... కదులు...గురుపాదాల వైపుకు....

* * *

మగవాడు తాను మగవాడినని సదా గుర్తుకు తెచ్చుకుంటూ ఉంటాడా? లేదు కదా?

'అహం బ్రహ్మాస్మి' అంటూ లేదా
'శివోహం' అంటూ కొందరు సదా జపం చేస్తుంటారు....

కొందరు నేతి-నేతి(నేనిదికాదు-నేనిదికాదు)అంటూ
సాధన చేస్తుంటారు.
అంటే వీరు అంతగా దేహాత్మభావంతో మమేకం అయిఉండబట్టే, వారికి అటువంటి సాధనలు అవసరమై ఉండొచ్చు.
అటువంటివారికి ఆ మాత్రం సాధన చేయడం సహాయమేగాని
నిజానికి తానెప్పుడూ 'అదే' కదా!

రాజకుమారుడు రాజే అవుతాడు.
సాలెవాని కుమారుడు సాలెవాడే అవుతాడు.
వాటికై ఎవరూ ప్రత్యేక సాధనలు చేయరు కదా!

బంగారం ఆభరణంగా మారుకున్నాక
బంగారం కాకుండా అయిపోతుందా?
ఆభరణం బంగారం కావడానికి సాధన చేయాలా?

* * *

సాధకుని పరిపక్వతను అనుసరించి

ఆ జ్ఞప్తినిపొందటంలో కాలభేదం ఉంటుందేగాని

"తానెప్పుడూ అదే" అనేది తిరుగులేని సత్యం.

పరిపక్వత అనేది కేవలం సద్గురు సన్నిధిలో మాత్రమే దొరికే అపురూపమైన స్థితి.

* * *

సాధన వలన తానే ఐన వస్తువు తాను కావడం

అంతేగాని తానుకానిది తానవ్వడం కాదు.

'నేను ఈ శరీరమాత్రుణ్ణి' అనే అబద్ధపు భావన నుంచి

'నేను ఆత్మస్వరూపుణ్ణి' అనే సత్యానుభవానికి

చేసే ప్రయాణమే "ఉపాసన".

ఎవరైనా సాధన అవసరమా? అని అడిగితే

తప్పనిసరిగా వారికి అవసరమే అంటాను.

యెందుకంటే ప్రశ్నించారంటేనే దాని అర్థం వారికి ఆత్మానుభవం కలుగలేదనే.

'నేను ఆత్మానుభవాన్ని పొందానంటారా....?' అని అడిగారు నా మిత్రుడు ఓ రోజు.

'పొందలేదు' అని చెప్పా ఖండితంగా...

యెందుకంటే పొందినవాడు అలా యెవరినీ అడగడు.

ఆత్మానుభవంలో

సంశయానికి, అయోమయానికి తావుండదు.

అంతేకాదు, అటువంటి మహనీయుడు తానై యెవడినీ పిలిచి బోధించడు.

యెందుకంటే వానికి అజ్ఞాని అనేవాడు తోచడు.

వాని దృష్టిలో "జ్ఞానం" తప్ప మరో వస్తువు కనబడదు.

ఇతరులు తనను నిరూపించడం గాని
తాను ఇతరులకు నిరూపించుకోవడంగాని
రెండవస్తులూ ఉండవు.

అలా ఎట్టి సంశయమూ లేని స్వస్థితిని పొందటానికి చేసే అనేక సాధనలలో ముఖ్యమైనది - అహం మూలాన్వేషణ.
అనగా "నేను" అనే భావన యెక్కడ పుడుతోందో
అక్కడకు తానెళ్లి స్థిరపడడం. (అంటే అచలంలో లేదా ఆకాశంలో చలనం ఎక్కడ ప్రారంభమవుతోందో అక్కడ స్థిరంగా ఉండడం)

దీనినే ఆత్మనిష్ఠ అంటారు.
ఆత్మనిష్ఠ కన్నా గొప్ప సాధనగానీ,
గొప్ప సిద్ధిగానీ మరేదీ లేదు.

* * *

**130. భగవంతునితో బంధమే మోక్షం**

అమాయకులైన పరమానంద శిష్యులు పదిమంది కలిసి ఓ నదిని దాటాక, అందరూ గట్టుకు చేరారా లేదా అని అనుమానమొచ్చి, అందులో ఒకడు తనను మినహాయించి లెక్కపెట్టేసరికి తొమ్మిదిమందే లెక్కతేలుతారు. ఒకడు నదిలో కొట్టుకుపోయాడని అందరూ ఘొల్లుమంటారు.

ఆ దారిన పోతున్న బుద్ధిమంతుడైన బాటసారి ఇది గమనించి,  లెక్కించేవాడినుంచి లెక్క మొదలుపెట్టి పదిమందిని లెక్కించి, మీలో ఎవరూ కొట్టుకుపోలేదని, అందరూ క్షేమంగా ఉన్నారని తెలియజేస్తాడు.

* * *

అలా తాను స్వతఃగా ముక్తస్వరూపుడు.
తాను పోగొట్టుకున్నదిగానీ,
క్రొత్తగా పొందవలసినదిగానీ

సాధన చేయవలసిన అగత్యంగానీ
తనకు అస్సలు లేనేలేదు.

ఆ అమాయక బాలుని వలె లెక్క(సాధన) చేస్తున్నాడు.
ఆ పదియవ వాడివి నీవే అని గుర్తుచేసేవాడు గురువు.
వెదికేవాడే.....చివరికి దొరికేవాడు కూడా.

* * *

పొరపాటున అద్దాలమహల్ లోనికి వెళ్లిన కుక్కకు
అనేక కుక్కలు ఉన్నట్టు భ్రమపడి ప్రతిబింబాల వైపుకు దాడి చేయడానికి ప్రయత్నించినట్టు

ఉండేది తానొక్కడే అయినా
తననే అజ్ఞానంతో అనేకంగా చూస్తూ
ద్వైతభావనతో ఘర్షణపడుతున్నాడు.

అద్వైతసిద్ధికై గురువును ఆశ్రయించి
సాధన చేస్తున్నాడు.

నిజానికి సాధనలోనూ, సిద్ధిలోనూ
ఉండేది "తాను" ఒక్కడే.

ముల్లును మరో ముల్లుతో తొలగించునట్లు
భ్రమను మరో భ్రమతోనే తొలగించాలని
గురువు నిశ్చయించి, శిష్యునికి ఒక సాధనను నిర్దేశించి
ఉన్న ముక్తినే ఇస్తాడు.

నిజానికి-
తనకు లేనిదానిని, తాను కానిదానిని
ఎవడూ ఇవ్వలేడు.
ఇవ్వబడినదంతా తనకున్న దానినే,

తానే అయి ఉన్నదానినే.

ఇతరులకు తాను క్రొత్తగా ఏదో పొందినట్టు
అనిపిస్తుందేగాని

సాధన ద్వారా తానెప్పుడూ ముక్తుడేనని,
పోగొట్టుకున్నది స్వరూపాన్ని కాదు,
జ్ఞప్తినే అని తెలుసుకుంటాడు.

మరపే - బంధం.
జ్ఞప్తియే - మోక్షం.

* * *

కథా రచయితను మరచినప్పుడు
కథలోని ప్రతి పాత్రా తామే కర్తలమన్నట్లు,
స్వతంత్రంగా వ్యవహరిస్తున్నట్టు తోస్తుంది.
ఆ పాత్రలు సుఖదుఃఖాలను అనుభవిస్తున్నట్లు తోస్తుంది.
తాను కర్త కాకపోయినా  తాను కర్త అనుకోవడం వలన తగులుకున్న బాధలే ఇవన్నీను.

కాసేపు కథ నుంచి ప్రక్కకు తప్పుకుని
నిజంగా వీరంతా కర్తలేనా? అని విచారిస్తే...
వీరు కాదు, "రచయితే ఏకైక కర్త" అని,
పాత్రలకు నిజమైన కర్తృత్వమనేది ఏమీ లేదని తెలిసి మనసు స్థిమితపడుతుంది. ఆ స్థిమితమే స్థితప్రజ్ఞత.

నిజానికి 'నేను కర్తను కాను' అనడానికి కూడా
నీవు కర్తవు కావు.
ఈ మాటయినా నీ వెనక ఉండి నిన్ను నడిపించేవాడు
అంటేనే నీవు అనగలవు.
నీ ప్రతి పలుకూ భగవంతునిదే.
నీ ప్రతి కదలికా భగవంతునిదే.

* * *

ఈ జగత్కథలో పాత్రలే  జీవులందరూ.

ఆ మహా కర్తే(రచయితే) పరమేశ్వరుడు.

ఆ కర్త తన వినోదము కొరకు రకరకాలుగా

పాత్రలను(జీవులను) సృష్టించి ఆడిస్తున్నాడు.

వినోదార్థం జరుగుతున్న ఈ ఆనందక్రీడలో "యెందుకు" అన్న ప్రశ్నకు అర్థం లేదు.

"ఈశ్వరుడు కర్త" అనేది నిజంగా తెలిసిననాడు

ఆ క్రీడలో నీవూ భాగస్వామ్యం అవుతావేగాని,

"ఎందుకు" అన్న ప్రశ్న వేయవు.

ఏ అయోమయానికీ లోను కావు.

ఏ సుఖదుఃఖాలకూ లోను కావు.

"కర్త"గా నీవెప్పుడైతే తప్పుకున్నావో

(ప్రారబ్ధ-ఆగామి-సంచిత)కర్మలు మూడూ నీ నుంచి తప్పుకుంటాయి.

నీవు "అకర్త"వు అవుతావు.

"అకర్త" తోలుబొమ్మలాంటివాడు.

తోలుబొమ్మకు సుఖదుఃఖాలు ఉండవు.

ఆడించేవాడు - చైతన్యస్వరూపుడు.

ఆటవస్తువులు - జడరూపాలు.

ఆడించేవాడు ఆడిస్తే ఆడుతాయి.

పెట్టెలో పడేస్తే ఊరికే ఉంటాయి.

అలా ఈ ఆత్మ అనే తెరపై ఆడే బొమ్మలు జీవులు.

అనే తెలివి కూడా దైవమే ఇస్తుంది జీవులకు.

జ్ఞానమూ దైవప్రసాదమే.
అజ్ఞానమూ దైవప్రసాదమే.

బంధమూ క్రీడే.
మోక్షమూ క్రీడే.

* * *

ఒకడు ముక్తిని కోరుతున్నాడంటే
తాను బంధంలో ఉన్నానని చెప్పక చెప్పినట్లే.

ఈ బంధం ఎలా వచ్చింది?
యెడతెగని విషయసంపర్కం వలన.
అనగా వ్యక్తులను, వస్తువులను విపరీతంగా అభిమానించడం వలన.

తిరిగి వాటిని ఎక్కడ పోగొట్టుకుంటామో అని మనలో అంతర్లీనంగా ఉన్న చింత వలన మనకున్న ఆ కాస్త ఐహిక సుఖం కూడా కలుషితం ఐపోతోంది.

ఇంట్లో దూరి సట్లో కూడును భయంభయంగా మాటిమాటికి దిక్కులు చూస్తూ తింటున్న కుక్క అనుభవించే సుఖం ఏపాటిది?
అంతే మనమనుభవించే సుఖాలు కూడా.

కారణం మనం అభిమానించే వ్యక్తులు, వస్తువులు
యెప్పటికైనా మన నుంచి దూరమౌతాయనే ఆలోచన వలన
స్థిమితమైన సుఖాన్ని అనుభవించలేకపోతున్నాం.

కాబట్టి వివేకవంతుడు ఏం చేయాలి?
యెప్పటికైనా నశించిపోయే వ్యకులను, వస్తువులను
అభిమానించడం మాని,
యెప్పటికీ నశించని ఆత్మవస్తువును అభిమానించడం నేర్వాలి మనసుకు.
అలాంటి శాశ్వతమైన సద్వస్తువుతో బంధం కలిగి ఉండడం దోషం కాదు.

యెందుకంటే అది నిత్యవస్తువు.
దానితో బంధం మనకు నిత్యసుఖాన్నిస్తుంది.

ఈ నిత్యసుఖాన్ని ఒక్కసారి చవి చూశాక
ఇక ఏ ఐహికసుఖమూ రుచించదు.

మందార మకరంద మాధుర్యమున దేలు మధుపంబు వోవునే మదనములకు.....
అలాంటి పరమసుఖి-
ప్రపంచంలో అందరిలో ఒకడుగా నటిస్తాడు...
బంధమూ మోక్షమూ లేని పరమపదంలో స్థిరపడి జీవిస్తాడు...

* * *

ముక్తి మూడు విధములని చెబుతారు-

1.రూపముక్తి

జగద్రూపంగా ఉన్నది భగవంతుడే అని,
జగత్సేవయే భగవత్సేవ అని,
లోకకళ్యాణనిమిత్తమై యజ్ఞయాగాది క్రతువులు చేస్తూ
నిష్కామంగా జీవిస్తూ తరించడం రూపముక్తి.
ఇతడు కర్మయోగి.

2.రూపారూపముక్తి.

పడవ సహాయంతో తీరాన్ని చేరగానే
పడవను వదిలి వెళ్లినట్టు
రూపాన్ని (విగ్రహాన్ని) ఆలంబనగా చేసుకుని
అరూపస్థితికి చేరి అరూపుడై తరించడం రూపారూపముక్తి.ఇతడు భక్తియోగి.

3.అరూపముక్తి.

నేనెవడను? అను ఆత్మవిచారణ చేస్తూ
నిరాకారపరబ్రహ్మమును స్వరూపంగా తెలుసుకుని
సదా ఆత్మనిష్ఠుడై తరించడం అరూపముక్తి.
ఇతడు జ్ఞానయోగి.

* * *

జ్ఞానాధికారియైన రమణులు ముచ్చటగా మూడు ముక్తులకు ముక్తాయింపు ఇచ్చారు.
అది ఏమనగా-
"ముక్తులను గురించి తలంచుచున్న అహంకార రూపమును వదులటే ముక్తి." అని తేల్చారు.

అహంకారమే బంధము.
అది వదులటే మోక్షము.

అహంకారమును ఎలా వదలడం?
నేను చేస్తున్నాననే కర్తృత్వ భావన లేకుండడం.
ఇతడు జీవన్ముక్తుడు.

* * *

**131. నేను 'కర్త'ను కానని ఉంటే ఉన్నా లేనివారే.**

గురువైనా, దేవుడైనా మనమున్న చోటుకే వస్తాడు...
భగవంతుని కోసమంటూ ఒక్క అడుగు కూడా వేయవలసిన అవసరం లేదు...
ఒక అడుగు వేసినా...
విడిచిన అడుగులో భగవంతుడు లేడని అర్థం వస్తుంది...
నీవున్న చోటనే ఉన్నాడు...
నీలోనే ఉన్నాడు...
నీవుగానే ఉన్నాడు...

హరిమయముగాని ద్రవ్యము పరమాణువు లేదు...

కనుక ఈ దైవ సృష్టిలో  ప్రతి అణువూ విలువైనదే...

నిరుపయోగం అని తలచి ఒక్క అణువును పెరికి వేసినా సరే ఈ విశ్వం కుప్ప కూలిపోతుంది...

శరీరాన్ని అంతం చేసే క్యాన్సర్ కణం కూడా హరిమయమే.

***

బోర్లించిన U ఆకారంలో ఉన్న ఒక విచిత్రమైన వస్తువు యొక్క బొమ్మను చూశాను...

ఒక కొసలో పెన్సిల్ కూసు ఉంది...

ఇంకొక కొసలో రబ్బరు(eraiser)ముక్క ఉంది...

పెన్సిల్ వ్రాస్తూ పోతుంటుంది...

వెనుకనే రబ్బర్ తుడుచుకుంటూ వెళుతుంటుంది...

ఏకకాలంలో రెండు పనులూ జరుగుతుంటాయి...

ఆ తెల్లకాగితంపై-

సదా అక్షరాలూ  ఉంటాయి...

సదా పరిశుభ్రంగానూ ఉంటుంది...

జ్ఞాని మనసు ఆ విచిత్రవస్తువు లాంటిదే...

ఏకకాలంలో-

వ్యవహారము జరుపుతూ ఉంటాడు...

అదే క్షణంలో నిర్వ్యవహారంగానూ ఉంటాడు...

ఏకకాలంలో-

ఆలోచనాపరుడుగానూ ఉంటాడు...

ఆలోచనారాహిత్యంగానూ ఉంటాడు...

ఇలాంటి స్థితి కలగడం మనకెలా సాధ్యం?

అంటారేమో...

చాలా సులభం...

నేను 'కర్త'ను కానని ఉండడమే...

ఆ స్థితిలో -

మీరు ఏమి చేసినా చేయనివారే అవుతారు...

మీరు ఏమి తలచినా తలవనివారే అవుతారు...

మీరు ఉన్నా లేనివారే అవుతారు...

అందరికీ మీరుంటారు...

మీకు మీరుండరు...

**132.ఆధ్యాత్మికం**

కోరిన వస్తువు దొరికినప్పుడు...

కలిగే ఆనందం నుంచి...

ఆ వస్తువు నశించిపోయినా సరే...

ఆనందంగా ఉండగలిగే స్థితి కలిగే వరకు...

చేసే ప్రయాణమే ఆధ్యాత్మికం...

* * *

ఆనందానికి కారణం వస్తువులు, మనుషులు కారణం కాదు...

అని తెలియజేయడానికే ఆ వస్తువులు, మనుషులు నశించిపోయేట్లు చేశాడు భగవంతుడు.

* * *

ఆభరణాల వెనుక బంగారం ఉన్నట్టు

ఈ సాకారాల వెనుక నిరాకారుడున్నాడు.

* * *

కుమ్మరిచక్రం తిరగటం వెనుక కుమ్మరి ఉన్నట్టు

సృష్టిచక్రం తిరగడం వెనుక సృష్టికర్త ఉన్నాడు.

* * *

శ్రీధర్ వెనుక శక్తి ఉన్నది.

శక్తి  వెనుక చైతన్యం ఉన్నది.

* * *

సకలానికి శక్తి(తల్లి)  ఎరుకే...

శక్తికి  చైతన్యం(తండ్రి)  ఎరుకే...

చైతన్యానికి సకలమూ ఎరుకే...

కానీ సకలానికి చైతన్యం ఎరుక కాదు...ఎప్పటికీ...

**133. పరమవిశ్రాంతి**

ధ్యాస మీద ధ్యాస - సనాతన మార్గం.

ధ్యాస మీద ధ్యాస అంటే?

దయచేసి అర్థం వివరించగలరు గురూజీ...

* * *

ద్రష్ట మీద దృష్టి పెట్టడం.

గమనించేవాణ్ణి గమనించడం.

సాక్షికి సాక్షిగా ఉండడం.

ఎరుకను ఎరిగి ఉండడం.

ధ్యానించేవాణ్ణి ధ్యానించడం.

* * *

అది ఎలా సాధ్యం? అని ఒకరడిగారు...

* * *

గురువుకు అనుభవం కాదు...

అనుభవమే గురువు...

అనుభవమే భాషిస్తుంది...

ఆ భాషణం శిష్యునికి అనుభవంగా ప్రకటమౌతుంది....

వినడం-అనుభవం ఏకకాలంలో జరుగుతుంది శిష్యునికి....

* * *

ఉపనిషత్ ఋషులు ఎక్కడా...

నీతిని బోధించలేదు...

సాధనలు చెప్పలేదు...

ఆ కేవలజ్ఞానంతోనే...

మాటలతోనే...

ఆత్మసాక్షాత్కారాన్ని కలుగజేశారు...

* * *

ఒకడు ఫోన్ చేసి-

ఆత్మవిచారణను తెలియజేసే మంచిగ్రంథాలు లిస్ట్ ఇవ్వండి...తెప్పించుకుంటాను... అన్నాడు...

* * *

పుస్తకాలన్నీ ప్రక్కనబెట్టి...

నీలోపలికెళ్లిపో....అన్నాను.

* * *

ఆత్మవిచారణ అంటే ఇదేనా?

అక్కడ నేనెవడను? అని ప్రశ్నించుకోవాలా?

* * *

కాదు...

(నేనుగాక)నీవెవడవు? అని నిన్ను ఆత్మ విచారిస్తుంది...

అదే ఆత్మవిచారణ.

ఆత్మ చేసే విచారణే ఆత్మవిచారణ.

నీకు ఉనికే లేదని తెలుసుకోవడమే...

ఆత్మవిచారణాఫలం.

అదే శరణాగతి.

అదే పరమవిశ్రాంతి.

* * *

విశ్రాంతిలో నీవుంటావు...

పరమవిశ్రాంతిలో నీవుండవు...

పరమవిశ్రాంతే ఉంటుంది...

**134. పరిపూర్ణంగా అనుభవించండి**

ఆలోచన ఉంటుంది.

అది లేకుండా పోవడం అంటూ ఏమీ ఉండదు.

నీవే ఆలోచన...

ఆలోచన లేకుంటే నీవే ఉండవు.

"ఆలోచనారాహిత్యస్థితి"ని కోరడం అంటే,

తన మరణాన్ని తాను కోరి తెచ్చుకోవడమే.

ఆత్మానందాన్ని రుచి చూడడం..

సైనేడ్ రుచి చూడడం...

రెండూ ఒకటే.

అక్కడ ఆలోచన పోతుంది...

ఇక్కడ శరీరం పోతుంది.

రెండింటిలోనూ నీవుండవు...

నీవే లేకుండా పోయినప్పుడు...

ఆత్మానందం ఎంత గొప్పదైతే ఏమి?

దాని కోసం జీవితాన్ని త్యాగం చేయడమేమి?

నీవు పోయాక కోటిరూపాయిలు ఇస్తాం...

అన్న insurance Policy లాంటిది...

ఇదంతా సిల్లీ...

"నేను లేని" అనుభవం కాకుండా...

"నేను ఉండి" అనుభవించాలి అనుకుంటే,

ఆ ఏర్పాటే "ఆలోచన".

ఆలోచనే ప్రపంచం.

ప్రపంచం అనేది పోపులపెట్టె....

ప్రతి గిన్నెలోని పదార్థాన్ని ఎప్పుడో ఒకప్పుడు ఉపయోగిస్తాం...

అలాగే ఇక్కడున్న అనుభవాలన్నింటినీ...

అందరూ...అంటే సాధారణవ్యక్తి నుంచి...

మహనీయుడు అనబడే వాని వరకు...

ప్రతి ఒక్కడూ ప్రతి ఒక్కటీ అనుభవించి తీరవలసిందే...

ఈ విషయంలో ఎవడూ అతీతుడు కాడు...

వేంకటరామను మరణభయంలో నుంచే కదా

భయరాహిత్యస్థితికి చేరుకుని ఋషి అయ్యారు...

ఆ ఋషిత్వాన్ని పొందటానికి భయం అనేది బీజం అయ్యింది కదా...

భయంలో నుంచే భయరాహిత్యస్థితి కలుగుతుంది.

పిరికితనంలోనుంచే ధైర్యం కలుగుతుంది.

స్వర్గానికి దారి నరకం నుంచే...

మోక్షానికి దారి బంధం నుంచే...

పిరికితనమో, భయమో...

ఏ అనుభవం కలిగినా దాన్ని భగవత్ ప్రసాదంగా స్వీకరించండి...

పరిపూర్ణంగా అనుభవించండి...

అదే "పరిపూర్ణత"కు దారి అవుతుంది...

* * *

రామకృష్ణులు అన్నట్లు...

ప్రపంచంలో గడపడమంటే...

పనసపండును వలవడమే...

"భగవద్విశ్వాసము" అనే నూనెను చేతులకు రాసుకుంటే...

ప్రపంచవిషయాలను అంటకుండా...

ఈ జీవితాన్ని దాటగలం...

అంతేగానీ...

దేన్నీ లేకుండా చేయలేం...

నీ ఇష్టదైవంతో నిరంతరం సహవాసం చేయి...

తప్పొప్పులు నీ నెత్తిన వేసుకోవద్దు...

ప్రతీది భగవదిచ్ఛను అనుసరించే జరుగుతోంది...

అన్న ధీమాతో జీవించు...

* * *

పరమాత్మ ఒడిలో నిర్భయంగా ఉంటూ...

కేరింతలు కొట్టండి...

**135. అద్వైతమే మూలబీజం-దేవునిగర్భం-కాలగర్భం**

తలరాత అంటే ఏమి?

* * *

జగన్నాటకంలోకి రాక మునుపు...

స్వయంగా నీవే నీ తలతో(బుద్ధితో)

వ్రాసుకున్న రాతే(స్క్రిప్టే) తలరాత...

తెరపైన ఒక అక్షరం కూడా మార్చడం కుదరదు...

ఏం మార్చాలన్నా తెర వెనుక జరగాల్సిందే...

తెరపైన-

జీవునిదీ ఓ పాత్రే...

అవతారపురుషుడిదీ ఓ పాత్రే...

తెరవెనుక ఇద్దరూ ఒకరే...

తెరపైన ఉన్నదంతా ద్వైతం...

తెరవెనుక ఉన్నదంతా అద్వైతం...

ఏకంగా ఉన్న బీజంలో నుంచే...

అనేకమైన శాఖోపశాఖలు...

ఉద్భవించి విస్తరిల్లినట్లు...

సమస్త ద్వైతప్రపంచానికి...

అద్వైతమే మూలబీజం...

ద్వైతప్రపంచంలో ప్రశ్న తొలగదు...

అద్వైతనిష్ఠలో ప్రశ్న కలుగదు...

అద్వైతం నీ స్వస్థానం...

ద్వైత ప్రపంచం నీకు విహారస్థానం...

* * *

రమేష్: ఏది స్వధర్మం? ఏది పరధర్మం?

* * *

రమేష్ గా ఉండడం స్వధర్మం.

ఆత్మగా ఉండడం పరధర్మం.

పరధర్మం అంటే పరాయి ధర్మం అని కాదు...

పర అంటే ఉత్కృష్టమైన అని అర్థం...

గీతలో కూడా పరధర్మం భయంకరమైనది...ఆచరణకు అనుచితమైనది....అన్నారు భగవానులు....

* * *

మా ఆవిడ గయ్యాళి...

నన్ను పచ్చి బూతులు తిడుతూ...

శాపనార్థాలు పెట్టినా, కొట్టినా...

నాకు ఏమి చలనం లేకుండా ఉంది...

కోపమూ లేదు...బాధా లేదు....

* * *

నీవు స్థితప్రజ్ఞుడవని నిరూపించిన మహాతల్లి...

ఆమె నీకు గురువుతో సమానం.

సోక్రటీసు, రామానుజుల భార్యలు కూడా గయ్యాళులే....

* * *

ఏమీలేదు "నేను" తప్ప.

ఇది సర్వవేదాంతసారము...

* * *

ఆ వాక్యంలో-

"ఏమీలేదు" వద్దనే ఆగిపోయింది శూన్యవాదం...

ఏమీలేదని గుర్తించే "నేను" ఉన్నాను కదా...!

అనే జ్ఞాతానుభవం సనాతనధర్మం...

* * *

శూన్యవాదం అనేది వాదన...రోదన...

సనాతనం అనేది అనుభవం...ఆనందం...

* * *

దేవునిగర్భంలో కాలం ఉంది.

కాలగర్భంలో లోకం ఉంది.

కాలగర్భంలో అన్నీ కలిసిపోతాయి...

దేవునిగర్భంలో కాలం కూడా కలిసిపోతుంది...

**136. అర్థం కాలేదు-అర్థం అయ్యింది-శరణాగతి**

అన్నయ్యా...! నాకు అర్థం కాలేదు...

దయచేసి కొంచెం వివరించండి...

* * *

అర్థం కాలేదు...అంటే,

అర్ధం(సగం) అయ్యిందనే కదా...!

అది చాలు...

* * *

ఒక సగం వాగ్రూపంగా ఉంటుంది...

మిగతా సగం అనుభవరూపంగా ఉంటుంది...

వాగ్రూపం(వ్యక్తం) - పార్వతి.

అనుభవం(అవ్యక్తం) - శివుడు.

ఇదే అర్ధనారీశ్వరతత్త్వం.

* * *

అర్ధం కాలేదు...అనే స్థితి నుండి...

అర్ధం అయ్యింది...అనే స్థితికి ఎదగడం విజ్ఞానం.

* * *

అర్ధం అయ్యింది...అనే స్థితి నుంచి...

అర్ధం కాలేదు...అనే స్థితికి ఎదగడం జ్ఞానం.

* * *

తెలియనితనం అనేది అజ్ఞానం కాదు.

అదే శుద్ధజ్ఞానం...

అక్కడ తెలియడానికి ఏమీ ఉండదు...

తనకు అన్యం లేక.

* * *

ఆ శుద్ధ తెలియనితనమే-

శిశుత్వం...

ఋషిత్వం...

దైవత్వం...

* * *

ప్ర: మనసంతా ఖాళీగా ఐపోతున్నది...

జ): ఖాళీ అవ్వాలనే కదా అందరూ సాధనలు చేస్తుండేది....

ప్ర: ఏ విషయం పట్లా ఆసక్తి కలగడం లేదు.

ప్రపంచవిషయాలేవీ ఉత్సాహమివ్వడం లేదు.

స్తబ్దుగా ఉంది.

జ): ఆసక్తి లేకపోవడం

ఉత్సాహం లేకపోవడం

ఆధ్యాత్మిక లక్షణాలే.

స్తబ్దత అనేది కూడా అవలక్షణమేమీ కాదు.

ఇవన్నీ మంచి లక్షణాలే.

భగవంతుని వైపుకే మీ అడుగులు పడుతున్నాయి...

ఏ విచారమైనా ఆత్మవిచారంలో అంతర్భాగమే.

ప్ర: నన్నిప్పుడు ఎలా ఉండమంటారు...?

జ):

ఏ పరిస్థితికా పరిస్థితి....

ఏ క్షణానికాక్షణం...

ఎలా ఉంటే అలా ఉండండి. (అంటే నిశ్చలమైన ఆకాశాన్ని, చలించే త్రిగుణాలను ఒకేసారి రెండింటిని కలిపి అనుభవించండి.)

ఉన్నదాన్ని ఉన్నట్టు అనుభవించడం తప్ప , అలా ఉండడం ఇలా ఉండడం అనేది మన చేతుల్లో ఏమీ  లేదు కదా.

ఈ ఒక్క విషయం జ్ఞప్తిలో ఉండడమే శరణాగతి.

**137. భ్రమాత్మక బంధాలు-అర్థమయ్యీ కానట్టుగా ఉంది**

ఓ రైతు తన మూడు గాడిదలను అమ్మేయడానికి అంగడికి తీసుకెళ్తున్నాడు... మార్గమధ్యంలో ఓ నది కనిపించింది... అసలే నడిచీ నడిచీ ఒళ్లంతా చెమట చిటచిట... స్నానం చేస్తే పుణ్యం, శుభ్రత రెండూ దక్కుతాయని అనుకున్నాడు...

ఆ గాడిదల్ని కట్టేయడానికి తన దగ్గర రెండే తాళ్లున్నాయి... మరి మూడో గాడిదను కట్టేయడం ఎలా..?

ఓ సన్యాసి అలా నడిచిపోతున్నాడు... తనను పిలిచాడు... స్వామీ, నీ దగ్గర ఓ తాడు ఉంటే ఇవ్వవా...? కాసేపు నా గాడిదను కట్టేస్తా, నా స్నానం కాగానే నీ తాడు నీకు తిరిగి ఇచ్చేస్తా...

నా దగ్గర తాడు లేదు కానీ ఓ ఉపాయం చెబుతాను అన్నాడు ఆ సాధువు...

నీ దగ్గర ఉన్న తాళ్లతో ఆ రెండు గాడిదలను కట్టెయ్... మూడోది చూస్తూనే ఉంటుంది... తరువాత దీని వెనక్కి వెళ్లి తాడుతో చెట్టుకు కట్టేస్తున్నట్టు నటించు...

సాధువు చెప్పినట్టే చేశాడు... నదీస్నానం పూర్తిచేశాడు... వెనక్కి వచ్చి ఆ రెండు గాడిదల కట్లు విప్పేశాడు... అదిలించాడు, తను ముందు నడుస్తున్నాడు... కాసేపయ్యాక చూస్తే రెండు తనతో వస్తున్నాయి కానీ మూడో గాడిద మాత్రం ఆ చెట్టు దగ్గర నుంచి అస్సలు కదలడం లేదు... అక్కడే ఉండిపోయింది...

తట్టాడు, కొట్టాడు, తిట్టాడు... ఊహూఁ... ఫలితం లేదు... అటూఇటూ చూస్తుంటే అదే సాధువు కనిపించాడు... స్వామీ, స్వామీ, ఇది మొరాయిస్తోంది, కదలనంటోంది...

అసలు నువ్వు కట్లు విప్పితే కదా, అది కదిలేది... అన్నాడు సాధువు...
అసలు నేను కట్టేస్తే కదా విప్పేది... అంటాడు రైతు...
అవునోయీ, అది నీకు తెలుసు, నాకు తెలుసు, ఆ గాడిదకు తెలియదు కదా... తను ఇంకా కట్టేసి ఉన్నట్టే భావిస్తోంది...

అయ్యో, మరేం చేయాలిప్పుడు..?
కట్లు విప్పితే సరి... కదులుతుంది...
అసలు కట్టేస్తే కదా... విప్పేది...
పిచ్చోడా... కట్టేసినట్టు ఎలా నటించావో, విప్పేసినట్టు కూడా నటించవోయ్...

రైతు అలాగే చేశాడు... గాడిద ముందుకు కదిలింది, మిగతా రెండింటితో కలిసింది... రైతు సాధువు వైపు అయోమయంగా చూశాడు...

"మనుషులు కూడా అంతేనోయ్... కనిపించని బంధాలేవో మనల్ని ఇక్కడే కట్టేసినట్టు వ్యవహరిస్తాం... కదలం, ఉన్నచోటు వదలం... నిజానికి అవన్నీ భ్రమాత్మక బంధాలు... అవేమీ లేవనే నిజం తెలిస్తే చాలు... ప్రపంచమంతా నీదే...

అర్థమయ్యీ కానట్టుగా ఉంది... అవును, మరి తత్వం, సత్యం ఎప్పుడూ సంపూర్ణంగా అర్థం కావుగా... రైతు కాసేపు బుర్ర గోక్కున్నాడు... సాధువుకు ఓ దండం పెట్టి తన గాడిదల వైపు కదిలాడు...

**138. అరిషడ్వర్గాలు-రాగద్వేషాలు**

ప్ర): రాగద్వేషాల నుండి, మోహవ్యామోహాల నుండి బయటపడడం ఎలా?

జ): ఎందుకు బయటపడాలి? ఉండండి లోపల్నే....

* * *

ప్రపంచం వైవిధ్యభరితంగా ఉండాలంటే,

అందరూ రకరకాలుగా ఉండాలి.

అందరూ ఒకే రకంగా ఉంటే,

అంత దరిద్రంగా ఉంటుంది ప్రపంచం.

* * *

అరిషడ్వర్గాలు ఉత్త జడాలు.
స్వతఃగా వాటికి ఉనికి లేదు.
వాటికి ఊపిరి పోసేది నీవే.
నీ సంస్పర్శ వల్లనే వాటికి ఉనికి వస్తోంది...
నీ నుంచి బయట పడడం ఎలా? అని పాపం అవి కూడా ప్రయత్నం చేస్తుంటాయి...

పిల్లి కాలు విరిగింది...
ఉదయం నిద్ర లేవగానే ఎవడి ముఖం చూశానో అని అది కూడా బాధపడవచ్చు.

* * *

అరిషడ్వార్గాలను వాటి మానాన వాటిని వదిలేస్తే,

అవి నిర్దోషులుగానే ఉంటాయి.

కానీ మనం రివర్స్ లో చెప్తాము-

కామ క్రోధాదుల వలన నేను ఇబ్బంది పడుతున్నాను...అని.
నిజానికి మన వల్లనే వాటికి చెడ్డ పేరు వస్తోంది.

* * *

భగవాన్ కూరగాయలు తరుగుతుంటే,
వ్రేలు తెగింది...తడిగుడ్డ చుట్టారు.

ఒకడు ఆ కట్టు చూసి- 'అరె ఏమైంది?' అని అడిగాడు.
'వ్రేలు మీద కత్తి పడింది' అని జవాబిచ్చాడు ఇంకొకడు.

భగవాన్ ఇలా సవరించారు-
వ్రేలు మీద కత్తి పడలేదు, కత్తి మీద వ్రేలు పడింది.
కత్తి జడం, వ్రేలు చైతన్యం. అన్నారు.
అనగా కత్తిని నిర్దోషిగా ప్రకటించారు.

కామక్రోధాదుల విషయంలో కూడా అంతే.
అవి జడం, నీవు చైతన్యం.

* * *

"నేను ఏదీ కాదు" అనైనా ఉండు.
"నేను కానిది ఏదీ లేదు" అనైనా ఉండు.
ఏ సమస్యా ఉండదు.
నేను ఈ సురేష్ ను మాత్రమే అని ఉన్నప్పుడు మాత్రమే అన్ని సమస్యలూ తగులుకుంటాయి.

* * *

ఏ సమస్యకూ ఎవరూ, ఏదీ కారణం కాదు.
తానే సమస్య; తనకు సమస్య కాదు.
అని తెలుసుకున్నప్పుడు ఏ సమస్యా ఉండదు.

* * *

స్వప్నప్రపంచానికి కేంద్రం నేనే అని తెలుసుకునేవరకు
ఏ సమస్యా తెగదు, తెగినట్లు అనిపించినా సరే.

'స్వప్నప్రపంచానికి నేనే కేంద్రం' అని తెలుసుకున్నవాడే
నిజంగా మెలకువలో ఉన్నవాడు.
ఆ మెలకువకే జ్ఞానం, మోక్షం అని పేర్లు.

* * *

ఇతరం తోస్తోందంటే నీవు కలలో ఉన్నట్లు.
ఇతరం తోయలేదంటే నీవు మెలకువలో ఉన్నట్లు.
నీవేంటో తెలిపే "ధర్మామీటర్" ఇదే.

* * *

'ఇదొక స్వప్నం' అని ఉన్నప్పుడు పాపం కూడా యజ్ఞమే అవుతుంది.
'ఇది నిజం' అని ఉన్నప్పుడు  యజ్ఞం కూడా పాపమే అవుతుంది.

* * *

**139. చూడబడేది అబద్ధం, చూచేవాడు నిజం.**

ఏదైనా మంచి మాటలు చెప్పండి...

"చూడబడేది అబద్ధం.
చూచేవాడు నిజం."
ఈ ఒక్క సూక్తిని సదా స్మరించుకుంటూ ఉండండి...
ఇదొక్కటి సరిపోతుంది...అన్నాను.
వారు చాలా సంతోషించారు.

* * *

"ద్రష్ట లేక దర్శనం సున్న" అన్నారు రమణ భగవానులు...

ఈ అద్భుతమైన జ్ఞానవాక్యం రోజులో ఒక్కసారైనా గుర్తుకు వస్తుంటుంది నాకు...

దాని అర్థం- "నేనే కేంద్రం".

* * *

ఇంకా ఇలా కొనసాగించాను-

ఆంజనేయులను కూడా నీవు చూస్తున్నావు కాబట్టి ఆంజనేయులు కూడా దృశ్యంలో భాగమే, అబద్ధమే.

చూచేవాడు మాత్రమే నిజం.

ఆ చూచేవాడు ఆంజనేయులు కాదు.

చూచేవాడు - తెర( ఆకాశం).

చూడబడేదంతా - తెరమీద కదలాడే నీడలు.

చూడబడేది ఎంత గొప్పగా అనిపించినా సరే, కనిపించినా సరే...

విలువివ్వొద్దు...

చూడబడేదాంట్లో గురువైనా సరే, దేవుడైనా సరే నీ చైతన్యపు నీడలే...

అని నీవున్నప్పుడు...

నీ గురువు కూడా సంతోషిస్తాడు...

వ్యవహారంలో(బయట) గురువును గురువుగానే చూడాలి...

అనుభవంలో(లోపల) తనతో సహా నీ గురువు కూడా

నీకు నీడగానే తోచాలి...

ఇది గురువును అవమానించడం కాదు...

ఇదే గురువుకు నిజమైన ఘనసన్మానం...

* * *

పాత ప్రశ్నే...

ఏకంగా ఉన్న దేవుడు అనేకం అవ్వాలని

ఎందుకు సంకల్పించాడు?

అడిగాడు ఆంజనేయులు?

* * *

"ఒకడు" గా ఉన్న నీవు ఒకడుగానే ఉండక...

వివాహం చేసుకుని, ఇద్దరు సంతానంతో

అనేకం ఎందుకు అయ్యావు? అని ప్రశ్నించాను...

నవ్వుకున్నాడు ఆంజనేయులు....

దేవుడు కూడా అంతే....అన్నాను....

* * *

దేవుడు సృష్టి ఎందుకు చేశాడు?

అని ప్రశ్నించడంలోనే...

ఎందుకీ పనికిమాలిన పని చేశావు? అని దేవుణ్ణి దోషిలాగా అతణ్ణి నిలదీయడం లాంటిదే కదా....

దేవుడు సర్వవ్యాపకుడు, సర్వాత్మకుడు, సర్వజ్ఞుడు అన్నాక....

ఇక ప్రశ్నించే అధికారం మనకెక్కడిది?

నోరు మూసుకుని పడి ఉండడమే మనం చేయవలసింది...

ఇదే రమణులు చెప్పిన "సుమ్మా ఇరు" అంటే.

ఈశ్వర నియతికి తల వంచి జీవించడమే నైపుణ్యం.

***

**140. అద్దెఇల్లు-జ్ఞానిలక్షణం-అంతర్భాగం**

అద్దె ఇంట్లో ఉన్నవాడు, ఆ ఇంట్లో ఉన్నంతకాలం

'మా ఇల్లు' అనే అంటాడు.

తన ఇంట్లో ఏదైనా శుభకార్యం జరిగినప్పుడు

ఇంటి యజమానితో కూడా అదే అంటాడు

'ఏమండీ! రేపు మా ఇంటికి రండి...' అని.

'మా ఇల్లు' అన్నాడని అతనితో యజమాని గొడవపడడు.

యెందుకంటే వ్యవహారం కోసమే అలా అంటారని

ఇరువురికీ తెలుసు.

అలాగే ఈ తనువు తనకు అద్దె ఇల్లు లాంటిది.

వ్యవహార నిమిత్తం నా శరీరం, నా సంసారం, నా ప్రపంచం, నా దైవం అంటాడు.

కానీ యజమాని భగవంతుడు.
యజమాని భగవంతుడు అనేది
జ్ఞప్తి కలిగి ఉన్నవాడు - జ్ఞాని.
మరచి ఉన్నవాడు - అజ్ఞాని.

అద్దె ఇల్లు పెచ్చులూడితే అద్దెకున్నవాడు ఏమీ చింతించడు.
ఆ ఇల్లు ఖాళీ చేసి మరొక ఇల్లు చూసుకుంటాడు.

ఇక ఈ శరీరం నిలబడని వ్యాధి వచ్చింది...
వదిలేసి మరొక ఉపాధిని వెతుక్కుంటాడు.
అదే పునర్జన్మ.

ఇల్లు మారితే యజమాని మారుతాడు.
కానీ శరీరం మారితే యజమాని(భగవంతుడు) మారడు.

సకలసృష్టికీ యజమాని ఆయనే.
సృష్టి యావత్తు భగవంతునికి ఓ సంకల్పం అంతే.

ఆయన ఒకేసారి మొత్తాన్ని ఖాళీ(లయం) చేసేస్తాడు.
అనగా సంకల్పరాహిత్యంగా ఉంటాడు.
నీవు నిద్రలో ఉన్నట్టు.

దేవుని సంకల్పరాహిత్యమే
జీవునికి జన్మరాహిత్యము.

కాబట్టి బంధమైనా, మోక్షమైనా భగవంతుని సంకల్పమే.

అందుకే అన్నమయ్య ఓ సంకీర్తనలో ఇలా అన్నారు-
"మదిలో చింతలు, మైలలు మణుగులు, వదలవు నీవవి వద్దనక."

భగవంతుడు "వద్దు" అనుకుంటే ఉండవు.

అంతేగానీ మనం వద్దు అనుకుంటే పోవు.

నా సంకల్పం కూడా భగవంతుని సంకల్పంలో అంతర్భాగమే కదా అంటావేమో!

ఇక బాధేముంది?

నీ శరీరం భగవంతుని శరీరంలో(సృష్టిలో) అంతర్భాగం.

నీ మనస్సు భగవంతుని మనస్సులో(మాయలో) అంతర్భాగం.

జీవుని బంధమోక్షములు దేవుని లీలావిలాసములు.

శరీరం ఉంటే ఉండనీ... ఊడితే ఊడనీ...

బంధం ఉంటే ఉండనీ... మోక్షం వస్తే రానీ...

ఏదైనా సరే ఉంటే ఏమి? లేకుంటే ఏమి?

అని ఉండటం జ్ఞానిలక్షణం.

***

**141. నవరంధ్రాలు-విషయ'జలం'**

నడిసముద్రంలో ఓడకు చిల్లుపడితే

నావికుని మనోస్థితి ఎలా వుంటుందో ఊహించండి...

శరీరమనే నౌకకు కూడా నవరంధ్రాలున్నాయి...

అందులోకి విషయ'జలం' దూరి...

కొద్ది కొద్దిగా మునుగుతున్నాం...

ఆ మునగటాన్నే 'జీవితం'గా అనుభవిస్తున్నాం...

పూర్తిగా మునగడం(మరణం) ఖాయం...

నీ ఆత్మకంటే నీకు మృత్యువు అత్యంత సన్నిహితంగా ఉంది...అంటారు శ్రీరామచంద్రులవారు భరతునితో.

* * *

పుట్టి పెరిగి నశించే స్వభావం కలిగింది దేహం.

ఈ దేహ తాదాత్మ్యత వల్లనే మృత్యుభీతి ఉండేది.

శాశ్వతమైన ఆత్మతో మమేకం వల్ల ఈ శరీరం తోచదు...

అందువల్ల మరణభయం ఉండదు...

అందుకే "శరణాగతి"కి పెద్దపీట వేశారు రమణులు.

శరణాగతి అంటే-

భవమరణాలు లేని మహేశునికి తనను తాను అప్పగించుకోవడం.

ప్రయాణికులందరూ తమ ప్రాణాలను డ్రైవరుకు అప్పజెప్పి హాయిగా నిద్రపోయినట్లుగా.

సద్గురు యమధర్మరాజు గారు

ఆత్మనెరిగినవానికి మృత్యువు అనేది

ఒక పసందైన నాటకం...అంటారు.

* * *

దేహము - కుండ.

ఆత్మ - కుండలోని ఆకాశం.

కుండ ఉన్నా...పగిలినా...అందులోని ఆకాశానికి నష్టమేమీ లేదు...

నేను అనేది చిదాకాశం.

కుండకు లోపలా, వెలుపలా ఆకాశం ఉన్నట్టు

తనువుకు లోపలా, వెలుపలా చిదాకాశమే(నేనే) ఉన్నది.

నా చిన్నప్పుడు మా అమ్మ తిడుతుండేది...

ఇంట్లో అలా ఓ మూల కూర్చోకపోతే...

బయటకెళ్ళి ఆడుకోవచ్చు కదా...! అని.

నేను పెద్దయ్యాక గురువుగారు కూడా అలానే మందలించారు-

ఈ తనువులో మాత్రమే నేనున్నాను అని ఎందుకుంటావు...?

వెలుపల కూడా నేనున్నాను...అని ఉండు...

అని ఈ నేనును తనువు నుండి విశ్వంలోకి వ్యాపింపచేశారు...

తనువు లోపలే ఉంటే మరణభయం ఉంటుంది.

వెలుపల కూడా నేనున్నాను అని ఉంటే
మరణభయం పోతుంది...

రమణుడు తన 16వ యేట అలానే వచ్చేశాడు
తన వొంటి నుండి...
తన ఇంటి నుండి...
అప్పా! నీ ఆజ్ఞ మేరకు వచ్చానంటూ...
అరుణాచలేశునికి శరణాగతి చెందారు...
అంతటితో రమణుని జీవితం ముగిసింది.
తరువాత రమణుడి రూపంలో నడయాడింది ఈశ్వరుడే...

ఇక అక్కణ్ణుంచి ఉన్నది రమణుని చరిత్ర కాదు...
రమణభక్తుల చరిత్రే...
దేవునికి చరిత్ర ఉండదు...
ఉండేది భక్తుల చరిత్రే...
భక్తులచరిత్రలో భగవంతుడు ఉంటాడు.
భగవంతుని చరిత్రలో భగవంతుడు తప్ప ఎవరూ ఉండరు.
* * *
భక్తులెవరూ లేక భగవంతుడు "ఒక్కడే" మిగలడం - భక్తియోగం.
భగవంతుడు కూడా లేక "ఒక్కటే" మిగలడం - జ్ఞానయోగం.

**142. వ్యక్తి-జగత్తు-జగదీశ్వరుడు-పూర్ణబ్రహ్మం-నాలుగు పావలాలు**

ప్ర): భక్తులెవరూ లేక భగవంతుడు ఒక్కడే మిగలడం భక్తియోగం...అన్నారు కొంచెం వివరించండి...
జ): నిజమే...
భక్తియోగం అనేది మార్గం కాదు.
అదొక సిద్ధావస్థ.
భగవంతుడు దొరికాక...
తనలో కలిగే పారవశ్యతే భక్తి...

తనకు అస్సలు బొత్తిగా పరిచయం లేని వ్యక్తిపై ప్రేమ ఎలా కలుగుతుంది?
కాబట్టి భక్తి వలన భగవంతుడు దొరకడం కాదు.
భగవంతుడు దొరికాక కలిగేది భక్తి.

* * *

రూపాయి చిల్లరను(అనగా నాలుగు పావలాలను)
ఒకే రూపాయి నాణెంగా మార్చుకోవడమే భక్తియోగము.

రూపాయి నాణెంగా మార్చుకున్న ఆ నాణెంలో
నాలుగు పావలాల వాల్యూ ఉంటుందిగాని...
నాలుగు పావలాలుగా లేకుండా
"రూపాయి నాణెం" ఒక్కటే మిగిలినట్లుగా...

భక్తులెవరూ లేకుండా "భగవంతుడు" ఒక్కడే మిగలడం కూడా అలాంటిదే...

ఒకటవ పావలా - వ్యక్తి (పావలా)
రెండవ పావలా - జగత్తు (అర్ధరూపాయి)
మూడవ పావలా - జగదీశ్వరుడు (ముప్పావు)
నాల్గవ పావలా - పూర్ణపరబ్రహ్మం (రూపాయి నాణెం)

వ్యక్తి జగత్తులో...
జగత్తు జగదీశ్వరునిలో...
జగదీశ్వరుడు పూర్ణబ్రహ్మంలో...
కలిసే ప్రాసెస్సే ఉపాసన.
మొత్తంగా అందరూ "ఒకటే"

వ్యక్తిమాత్రంగానే ఉంటూ
జగత్-ఈశ్వరుడు-పూర్ణపరబ్రహ్మము అనేవి
పరోక్షవిషయాలుగా అనుభవంలో ఉన్నప్పుడు
నీవు పావలాగా ఉన్నట్టు.

ప్రపంచంలో నేనున్నాను...అని కాకుండా
'నాలో ప్రపంచం ఉంది' అనే అనుభవం కలిగినప్పుడు
నీవు అర్ధరూపాయిగా ఉన్నట్టు.

ఆ ప్రపంచం ప్రపంచంగా కాకుండా
ఈశ్వరరూపంగా దర్శించినప్పుడు
నీవు ముప్పావు రూపాయి ఉన్నట్టు.

"నేను" అన్నప్పుడు ఆ నేను మొత్తానికి ప్రతీకగా
అనుభవం అయినప్పుడు
నీవు పూర్ణరూపాయిగా అయినట్టు.

నాల్గవ తరగతి విద్యార్థిలో
మిగతా మూడు తరగతుల విద్యార్థులూ ఉన్నట్లు...

పూర్ణపరబ్రహ్మంలో-
జీవ-జగత్-జగదీశ్వరులు మూడూ ఉంటాయి...

* * *

భగవాన్ అంటారు-
ఏ మతమైనా 1.జీవుడు 2.జగత్తు 3.ఈశ్వరుడు
అనే మూడు వస్తువులను బట్టే ఆరంభమౌతుంది.
ఒక వస్తువే మూడవుతుంది.
అహంకారం ఉన్నంతవరకే మూడూ మూడు ముక్కలుగా ఎప్పుడూ కనబడతాయి.
కాబట్టి నేను(అహంకారం) చచ్చి
తన స్థితిలో (అనగా ఆత్మస్థితిలో) తానుండడం ఉత్తమం.

* * *

"నేను కర్త"ను అను భావమే అహంకారం.

అహంకార నాశనమే మోక్షం.

శరణాగతే అందుకు ఉత్తమమార్గం.

తన పరిమితుల్ని గుర్తించడమే శరణాగతి.

ఆత్మలో స్థిరపడుటయే శరణాగతి ఫలం.

* * *

"నేను" అన్నా, భగవంతుడు అన్నా

అర్థం ఒక్కటే.

"నేను"సాకారంగా ఉంటే భగవంతుడు.

భగవంతుడు నిరాకారంగా ఉంటే "నేను".

నేను - అన్నప్పుడు వ్యక్తి మాత్రంగా తోచకుండా

జీవ-జగత్-జగదీశ్వర సమిష్ట్యానుభవం కలిగినప్పుడు దానినే 'పరమపదం' అనదగును.

ఆ సమిష్ట్యానుభవం కలగాలంటే ఏం చేయాలి?

అని తప్పకుండా మీరు ప్రశ్నిస్తారు...

దానికి ఒకటే సమాధానం-

సద్గురువును ఆశ్రయించు...

సద్గురు సన్నిధిలో-

సమస్యే సమాధానమవుతుంది.

శూన్యమే పూర్ణమవుతుంది.

మౌనమే ఉపదేశమవుతుంది.

అహమే ఆత్మ అవుతుంది.

* * *

ఈ ఆధ్యాత్మికంలో ఉన్న తమాషా ఏమంటే-
ఇందులో ఓటమే విజయం అవుతుంది.
మృత్యువే అమృతత్వం అవుతుంది.
పోగొట్టుకోవడమే పొందటం అవుతుంది.
నిస్సహాయతే బలం అవుతుంది.
దుఃఖమే సుఖం అవుతుంది.

* * *

వ్యక్తిగా నటించు...
ఆత్మగా జీవించు...

**143. అద్వైత జ్ఞాన సూత్రాలు-1**

1. నాతో సహా సర్వమూ నాలో ఉన్నట్లున్నది.
కానీ లేనే లేదు.

2. నేను మాత్రమే ఉన్నాను.
ఇక మాయకు తావేది?

3. 'నాది' అనడానికి నాకు విడిగా ఏమీలేదు.

4. నేనన్నదే వేదం
నేనున్నదే క్షేత్రం.

5. నాలోనే పుట్టి, ఉండి, నాలోనే నశించిపోయే ఆలోచన వంటిది ఈ ప్రపంచం.

6. నేను చూచే ప్రపంచం నాదే; నేనే.

7. నా పూర్వ పూర్ణస్థితియే నా పూర్వజన్మ.

ఆ పూర్ణస్థితిని తిరిగి జ్ఞప్తికి తెచ్చుకోవడమే నా మరుజన్మ.

8. సృష్టిలోని ప్రతి కదలిక నా కదలికే.

9. జగన్నాటక రచయిత, ప్రవక్త, నటీనట సమూహము, నేపథ్యము, ప్రదర్శకుడు, ప్రేక్షకులు, సూత్రధారి, నిర్మాత సకలమూ నేనే. విమర్శకుడు కూడా నేనే.

10. నామము, రూపము, పదము, అర్థము, ఉనికి, జ్ఞానము, అనుభవము అన్నిటి లక్ష్యమై ఉన్న ఏకైక స్ఫురణ 'నేను'.

11. నేనెవడను? అనే విచారణ ప్రారంభమునకు మునుపే నేను ఆ విచారణఫలమై ఉన్నాను.

12. నేను మాత్రమే ఉన్నాను.
ప్రపంచం నా ప్రకాశం.

13. జనన మరణాలు ఉండేది 'నాది'కి.
'నేను'కు కాదు.

14. ఏకంగా ఉన్న నేను అనేకం ఎప్పుడూ కాలేదు.
సదా నేను ఏకంగానే ఉన్నాను.

15. జనన మరణాలు
దేశకాలములు
నాలోనివి.

16. నేను ఇతరంలో ఉన్నాను.
ఇతరం నాలో ఉన్నది.

17. నేను ఏ నేనునూ తెలుసుకొనే అవసరము, అవకాశము లేదు.

నన్ను ఏ నేనూ తెలుసుకొనే అవసరము, అవకాశము అసలే లేదు.

18. సకలమునకు నేను ఉండు అవసరము, అవకాశము ఉన్నదేమో కాని, నాకు నేనుండవలసిన అవసరము, అవకాశము లేనే లేదు.

19. నాకంటే  అధికమైనదిగాని, సమానమైనదిగాని ఏదీ లేదు.

20. నేనెవరో నాక్కూడా తెలియదు.
నాక్కూడా తెలియని నేనే నేను.

21. "ఓం"కారానికి నిజమైన అర్థం "నేను".

22. నాలోనిది ఈ ప్రపంచం.
నా ఒక్కనిదే ఈ ప్రపంచం.
నేనే ఈ ప్రపంచం.

23. నేను ఉంటేనే సకలమూ ఉంటోంది.
కాబట్టి నేనే సకలము.

24. నేను అనేక నేనులను ఆవిష్కరించాను.
కానీ ఈ అనేక నేనులు నన్ను (నేనును) ఆవిష్కరించలేవు.

25. 'నేను ఏకవస్తువు' అని తెలిసి
ఆనందించడమే యోగం.

26. నేను ఆకాశానికి అవకాశమై ఉన్నాను.

27. నా చేత అనుభవించబడే సత్యాలు అనేకం.
నేను అనుభవించే సత్యం ఏకం.

28. నాకు నాథుడు ఉండవలసిన అవసరంగాని, అవకాశంగాని లేని అనాథుడను నేను.

29. 'భగవంతుడు నేనే' అని ఉండడమే భగవత్సాక్షాత్కారము.

30. 'నేను' అనేది ఒకటే.
'ఒకటి' అనేదే దేవుడు.

31. సర్వ రూపాలు
సర్వ నామాలు
నేనే.

32. 'నేనెవడను' అనేది ప్రశ్న కాదు.
సమాధానం.

33. నన్ను నేనెలా పొందటం?
ఎలా పోగొట్టుకోవడం?

34. 'నాది' అనేది - పరధర్మం.
'నేను' అనేది - స్వధర్మం.

35. 'నేను' అనేదే మార్గము.
'నేను' అనేదే గమ్యము.
'నేను' అనేదే జీవము.
'నేను' అనేదే సత్యము.

36. "నేను" పుట్టలేదు....పుట్టినట్టు కనిపిస్తున్నాను.

37. నాకు రెండు పేర్లు- 1. మంచిపేరు 2. చెడ్డపేరు

38. నాకు మూడు రూపాలు 1. నేను 2. నీవు 3. అతడు.

39. నా నామం - అహమహం.
నా రూపం - అనంతవిశ్వం.

నా ఆశ్రమం - ఆత్మాశ్రమం.

40. నా ప్రతిబింబం - ప్రపంచం.

41. అన్ని నేనులు నేనై ఉన్న నేనే నేను.

42. సృష్టి స్థితి లయాలు నా అనంత క్రీడ.

43. నాకు అన్యం లేదు.
నాకు బంధం లేదు.
నాకు కర్తవ్యం లేదు.

44. కల-ఇల నాలోనివి.

45. ఒకటి కాని ఒకటి నేను.

46. తిరుగలిని త్రిప్పేదీ నేనే.
తిరుగలిలో నలిగేదీ నేనే.

47. నన్ను నేను మరిస్తే - ప్రపంచం నిజం.
నన్ను నేను తెలిస్తే - ప్రపంచం అబద్ధం.

48. నేనే గణపతి
నేనే పశుపతి

49. మేను - కర్మయోగి.
నేను - జ్ఞానయోగి

50. నేను ఎవరినీ చూసింది లేదు.
ఎవరూ నన్ను చూసిందీ లేదు.

51. జయంతి, వర్థంతులు ప్రపంచానికేగాని నాకు ఉండవు.
నేను సదా ఉండేవాడిని.

52. నేను కర్తగా దోచు సకల కర్మ క్రియా కలాపములు మొదట 'నాలో' అనునది సామాన్యమై ఉన్న అనుభూతి ఏది కలదో అదియే స్వస్వరూపానుభవమై ఉన్నది.

53. ఏదో ఏదో అనుకునేదీ నేనే.
ఆ ఏదో ఏదో అయి ఉండేదీ నేనే.
ఆ ఏదో ఏదో అనబడేదీ నేనే.

54. నేను పుట్టక ముందు ఎవడూ పుట్టింది లేదు.
ఉన్న సమస్తమూ నేను పుట్టాకే పుట్టింది.
నేను ముక్తి పొందకుంటే ఎవడూ ఏదీ ముక్తి పొందదు.
ఉన్న సమస్తమూ నేను ముక్తి పొందాకే ముక్తి పొందుతుంది.

55. నేను మాత్రమే ఉన్నాను.
నాకు అన్యము లేదు.
అన్యము ఉన్నట్టు అనిపించినా సరే
అది కూడా నేనే.
నేను మాత్రమే ఉన్నాను.

56. భారతగ్రంథములోని పాత్రలు, వాటి నేనులు, వీటి మూలము
వ్యాసరూపమున ఉన్న నేను.
ఈ నేనుకు మూలము ప్రస్తుత దేహరూపమై ఉన్న నేను.
ఈ నేనును తెలియు నేనే 'నేను'.

57. జీవించయినా, మరణించయినా నేనుంటాను.

58. వ్యక్తిగతమైన నామముతో పిలువబడేవాడు నేను కాదు.
ఆ రూపంతో కనిపించేవాడు నేను కాదు.
ఆ రూపంతో జీవిస్తున్నవాడు నేను కాదు.

ఆ రూపంతో ఉన్నవాడు నేను కాదు.

అతడు సదా అంటున్న నేను నేను కాదు.

59. నా పరిమితులు నాకు తెలుసు.

నా అపరిమితం నాకు తెలియదు.

ఇక్కడ పరిమితులు తెలియడం జ్ఞానం.

అక్కడ అపరిమితం తెలియకపోవడం జ్ఞానం.

60. నన్ను నేను చేరుకోవడానికి

మార్గమేమి? గమ్యమేమి?

61. కేంద్రం గురువూ కాదు, దేవుడూ కాదు.

ఆ ఇద్దరికీ "నేనే" కేంద్రం.

62. "నేనే కేంద్రం" అని ఉండడమే సాధనా; సిద్ధి.

63. జవాబు లేని ప్రశ్న నేను.

ప్రశ్న లేని జవాబు నేను.

64. మూలకారణం లేని మూలకారణం నేను.

ఆధారం లేని సర్వాధారుడను నేను.

బహువచనం లేని ఏకవచనం నేను.

65. గుర్వనుగ్రహం కంటే

నా("నేను") అనుగ్రహం ముఖ్యం.

66. దిగంబరుడను నేను.

చిదంబరుడను నేను.

67. సత్యనుభవం ఒక్కనికే.

ఆ ఒక్కడు "నేనే".

68. ఇక్కడా నేనే ఉన్నాను.
అక్కడా నేనే ఉన్నాను.

69. దేని చేతా నేను సృజింపబడలేదు.
దేనినీ నేను సృజించలేదు.

70. నాకు సమాధానం కాదు
నేనే సమాధానం.

నాకు జ్ఞానం కాదు.
నేనే జ్ఞానం.

నాకు సుఖం కాదు.
నేనే సుఖం.

71. వినబడే శబ్దం నేనే; నాదే.
కనబడే దృశ్యం నేనే; నాదే.
తలవబడే తలంపు నేనే; నాదే.

72. ఎవరైనా ఏదైనా 'నేను' కావాలి.
'నేను' ఎవరూ, ఏదీ కాను.

73. జగత్తులో నేనున్నాననుట ఐహికము.
జగత్తుగా నేనున్నాననుట ఆముష్మికము.

74. 'నాది' అనడానికి ఏమీ లేకపోవడం - సన్న్యాసం.
'నేను' అనడానికి ఏమీ లేకపోవడం - నిర్వాణం.

75. జగత్తులో ఎవని ఉనికి అయినా నా ఉనికి మీద
ఎవని జ్ఞానం అయినా నా జ్ఞానం మీద

ఎవని శక్తి అయినా నా శక్తి మీద
ఆధారపడి ఉన్నది.

76. వెలుగు చీకటులను గుర్తించే వెలుగు నేను.
ఉనికి లేములను గుర్తించే ఉనికి నేను.

77. నేను మాత్రమే ఉండడం - ఒంటరితనం.
నేను కూడా లేకపోవడం - ఏకాంతం.

78. అప్పుడు, ఇప్పుడు, ఎప్పుడూ
అక్కడ, ఇక్కడ, ఎక్కడా
జీవ, జగత్, ఈశ్వరులనే త్రిపదార్థాల దృశ్యమంటూ ఏదీ ఏర్పడలేదు.
సదా నేను నేనుగానే ఉన్నాను.

79. అణువుకు, తనువుకు, జగత్తుకు
కేంద్రం - నేను.

80. పదములన్నీ 'నేను' అను పరమపదమునకు
పర్యాయపదములే.

81. నేనున్న చోటనే నేనుంటే
నేనున్నరీతినే నేనుంటే
అదే పరమపదం.

82. 'నేను' అంటే మొత్తం.

83. ఏది నేనుగా ఉన్నదో
అదే నేను.

84. నేనున్న చోట సాకారంగా ఉన్నాను.
నేను లేని చోట నిరాకారంగా ఉన్నాను.

85. నేను సర్వదా, సర్వత్రా, సర్వమై, ఏకమై ఉన్నాను.

86. భేదాలుండేది 'నాది'లో; 'నేను'లో కాదు.

87. 'ప్రపంచంలో నేను' అన్న వర్గదృష్టిలో మాయ నిత్యం.
'నాలో ప్రపంచం' అన్న వ్యక్తిగతంలో మాయ అనిత్యం.

88. అందరి వ్యక్తిత్వాలు
నా వ్యక్తిత్వంలో అంతర్భాగాలే.

89. నేను-
అందరిలో ఉన్నా నేనొక్కణ్ణే ఉంటాను.
నేనొక్కణ్ణే ఉన్నా నేనొక్కణ్ణే ఉంటాను.
నేను లేకున్నా నేనొక్కణ్ణే ఉంటాను.

90. అచలస్వరూపమైన నాలో
స్వాభావికమై ఉన్న సంకల్పవైభవమే
ఈ మహాసృష్టి.

91. ఒకే నేను అనేక నేనులుగా ఉండడం - మెలకువ.
అనేక నేనులు ఒకే నేనుగా ఉండడం - గాఢనిద్ర.

92. వ్యవహారంలో-
అందరిలో 'ఒకడు'గా ఉంటూనే
అనుభవంలో అందరుగా నేనే ఉంటాను.

93. నేనెక్కడ తిరిగినా
ఉండేది సదా నాలోనే.

94. ఎవరిని చూసినా, దేనిని చూసినా

'నేను' అనే అనుభవం కలగడమే ఆత్మానుభవము.

95. ప్రతి తలంపు, ప్రతి పదము, ప్రతి ఉనికి యొక్క అర్థము - నేనున్నాను.

96. నాలో అన్నీ ఉంటాయి;
ఆది, అంతము తప్ప.

97. 'నేను'ను ఎవడూ ఖండించలేడు.
సర్వజనామోదమైన ఏకైక తత్త్వం 'నేను'.

98. వ్యక్తావ్యక్తాలు
కార్యకారణాలు
సాకారనిరాకారాలు
ఏకకాలంలో ఈ రెంటినీ 'అనుభవం'లో కలిగి
ఏ నేనైతే ఉన్నదో ఆ నేనే 'నేను'.

99. నేను ఏ అనుభవమూ లేని
కేవలసాక్షి స్వరూపుడను.

100. నేను జగత్తులో ఉన్నప్పుడు నేను మాయాలోలుడను.
నేను జగత్తుగా ఉన్నప్పుడు నేను మాయామయుడను.
నాలో జగత్తు ఉన్నప్పుడు నేను మాయాతీతుడను.

101. నేనే అనేక నేనులుగా చెలామణి అవుతున్నాను.

102. నేను ఎవరూ కాదు.
నేను ఏదీ కాదు.
ఎవరూ నేను కాదు.
ఏదీ నేను కాదు.
మరి నేనెవడను?
దిక్కు తోచనివాడను.

దిక్కు లేనివాడను.

103. వ్యక్తి నుండి వచ్చినట్టు కనబడే మాట కూడా
నా('నేను') నుండి వచ్చినమాటే.

104. నేను ఎవరో ఒకరుగా, ఎప్పుడో ఒకప్పుడు, ఎక్కడో అక్కడ, ఎలాగో ఒకలాగు "ఉన్నాను". ఇక బాధేముంది?

105. నాతో సహా ఈ ప్రపంచం నాలోనే పుట్టింది.
నాతో సహా ఈ ప్రపంచం నాలోనే ఉంటుంది.
నాతో సహా ఈ ప్రపంచం నాలోనే లయమైపోతుంది.

106. నా ప్రభావము దేనిమీదా ఉండదు.
దేని ప్రభావమూ నా మీద ఉండదు.

107. సకారణం, అకారణం రెండూ నేనే.

108. దేనినీ నేను అంటను.
ఏదీ నన్ను అంటదు.
'నేను' ఏ అంటూ లేనివాడను.

* * *

**144. Conclusion**

గాఢనిద్ర జడం.
అది ఆనందస్వరూపం.
కానీ 'నేనున్నాను' అన్న ఎరుక మాత్రం శూన్యం.

మెలకువ కూడా జడమే.
ఇక్కడ  ఆనందం శూన్యం.

కానీ 'నేనున్నాను' అన్న ఎరుకమాత్రం పూర్ణం.

నిద్రలో లేని ఎరుక, మెలకువలో లేని ఆనందం
ఏకకాలంలో అనుభవంలోకి రావడమే తురీయం.
ఇది చైతన్యస్వరూపం.

మెలకువలో 'నిద్ర'పోగలిగితే
(అనగా ఉన్నదెల్లా ఉన్నట్లున్నదే అని ఉండగలిగితే)

నిద్రలో 'మెలకువ' కలుగుతుంది.
(అనగా ఉన్నదెల్లా ఉన్నదే అనే అనుభవం కలుగుతుంది.)

మెలకువలో నిద్ర కలగడానికి ఏదైతే ఆటంకపరుస్తోందో
దానికంతా 'సంసారం' అని పేరు.

నిద్రలో మెలకువ కలగడానికి ఏదైతే తోడ్పాటు అవుతోందో
దానికంతా ఆధ్యాత్మికం అని పేరు.

మెలకువా పరమం కాదు.
నిద్రా పరమం కాదు.

నిద్రతో కూడిన మెలకువ, మెలకువతో కూడిన నిద్ర
ఇది మాత్రమే పరమం.

* * *

ఆ తురీయస్థితి ఎలా కలుగుతుంది?
అని మాత్రం అడక్కండి...
అది ఒకే ఒక్కనికి మాత్రమే సంభవం.
వాణ్ణే 'దేవుడు' అనేది మనం.

అది రెండవవానికి కలిగే అవకాశమే లేదు.
యెందుకంటే 'రెండవవాడు' అస్సలు లేనే లేడు కాబట్టి.

ఆ దేవుడికి 'రెండవ వాడు' ఉంటే,
వాడు దేవుడూ కాదు, అది తురీయమూ కాదు.

తురీయం అనేది ఏకాత్మస్థితి.
'నేను మాత్రమే ఉన్నాను' అన్న అనుభూతి అది.
ఆ అనుభవం నీకు కలిగితే నీవే ఆ దేవుడవు.

ఆ ఏకాత్మస్థితి కలగాలంటే ఏంచేయాలి?
అన్న ప్రశ్న అడగబడుతూనే ఉంది అనాది కాలం నుంచి.

పొందినవారంతా అప్రయత్నంగా పొందినవారే.
ప్రయత్నంతో పొందిన దాఖలా చరిత్రలో లేదు.

అప్రయత్నంగా పొందినవాడు 'గురువు' అయినాడు
ప్రయత్నంతో పొందాలనుకునేవాళ్లు 'శిష్యులు' అయినారు.

"మరి ఏం చేయమంటారు?" అని గురువుగార్ని
ఎవరో ఒకరు అడుగుతూనే ఉంటారు.
"ఏమీ చేయొద్దు" అని స్పష్టంగా, కరాఖండితంగా చెబుతుంటారు.

మరి ఏదో ఒకటి చేస్తుండడం(కదలటం) అనేది
ఈ మనస్సు యొక్క ప్రవృత్తి కాబట్టి-

దానికి పని కల్పించినట్టే చేస్తూ, దానిని నిశ్చలపరచే మార్గం కనుక్కున్నారు ఋషులు.

అదే "అహం బ్రహ్మాస్మి" మంత్రం.
నేను బ్రహ్మమును, నేను బ్రహ్మమును...అని అనుకుంటూ ఉంటే, ఒకనాటికి అది స్థిరమౌతుంది.
అదే సాధన, అదే సిద్ధి, అదే పరమానందం.

అనుకుంటే సరిపోతుందా? అని అడిగితే,
"సరిపోతుంది" అని స్పష్టంగా చెప్పారు గురువుగారు.

"నేను శ్రీధర్" అనే అబద్ధాన్ని అనుకుని అనుకుని నిజం చేసుకున్నావు.

"నేను బ్రహ్మమును" అనే నిజాన్ని అనుకుని అనుకుని ఎందుకు నిజం చేసుకోవు?

అనే బోధను కొన్ని వందలసార్లు విని ఉన్నాను గురువుగారి నోట.

నేను స్వస్థితి నుండి జారినప్పుడల్లా,
తిరిగి నన్ను స్వస్థితిలో నిలబెట్టడంలో ఏ మాత్రం శ్రమ చెందరు గురువుగారు.

అలా స్వస్థితిలో నిలబెట్టడానికి వారి నోటి నుండి తరచుగా వచ్చే అమృత వాక్యాలివే-

1. 'అదే నేను' అని అనుకుంటూ ఉండు.
2. ఉండేది ఉండనీ...ఊడేది ఊడనీ...
3. అయితే ఏమి? కాకుంటే ఏమి?
4. అందరూ అంటూ ఎవరూ లేరు. ఉండేది నీవొక్కడివే.
5. నీవు వెతికేది మూడవస్థల్లోనూ లేదు.
6. నీవు ఏమీ చేయొద్దు. చేసేవారిని ఆపొద్దు.
7. ఏ సాధనా చేయకపోవడమే పెద్ద సాధన.
8. నీకు నీవు అడుగు ఎడంగా ఉండు.
9. ఆధ్యాత్మికం వల్ల లాభమూ లేదు, నష్టమూ లేదు.
10. ఏదైనా అను. 'మొత్తం అదే' అను.
11. ఎలాగైనా ఉండు. 'ఇది కల' అని ఉండు.
12. అన్నిటికీ సిద్ధపడి ఉండడమే సిద్ధి.
13. నాతో సహా సర్వమూ నాలో ఉన్నట్లున్నది.
14. ఏ అనుభవమూ లేకపోవడమే ఆత్మానుభవం.
15. 'ఒకటి' యెప్పుడూ రెండు కాలేదు.
16. ఉన్నది పోదు, లేనిది రాదు.

17. పోల్చుకోవడం మానేయ్.

18. నీవు రాక ముందు ఏదీ లేదు. నీవు పోయాక ఏదీ ఉండదు.

* * *

ఉండగలిగితే ఊరికే ఉండండి.

ఊరికే ఉండలేకుంటే 'అహంబ్రహ్మాస్మి' అనుకోండి.

ఇంతకు మించి ఏమి చెప్పినా వాడు కపట గురువే.

ఇంతకు మించి ఏమి ఆశించినా వాడు కపట శిష్యుడే.

ఇదే నేను పొందిన Conclusion.

* * *